క్లుప్తంగా

దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలి



తిరువూరు: ఏకొండూరు మండలం మారేపల్లిలో దళిత కుటుంబంపై అగ్రవర్ణాలు దాడి చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం శోచనీయమని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా అన్నారు. పది రోజుల క్రితం అగ్రవర్ణాల దాడిలో గాయపడి తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మారేపల్లికి చెందిన బీమాల బాబూరావు, దానయ్యలను సీపీఐ నాయకులు సోమవారం పరామర్శించారు. వ్యవసాయభూమిలోకి దళితులు రాకపోకలు జరపకుండా అగ్రవర్ణాలు అడ్డగించి కులం పేరుతో దూషించగా, ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. దళితులకు న్యాయం జరగకపోతే రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరు వెంకటేశ్వరరావు, మేకల డేవిడ్, మాలపాటి ఉదయ్, అశోక్ తదితరులు బాధితులను పరామర్శించారు.

ఆరోగ్యం పరిరక్షించుకోవాలి



తిరువూరు: విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నిత్యం వ్యాయామం చేయడం, క్రమపద్ధతిలో ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. డాక్టర్ చెన్నారెడ్డి విద్యార్థులకు వైద్యసేవలందించారు. మూడు రోజుల పాటు జరిగే వైద్యశిబిరంలో దంతపరీక్షలు, రక్త వర్గీకరణ, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు. క్లబ్ కార్యదర్శి కే రాజేష్‌ఖన్నా, దూపకుంట్ల నరసింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజ



ముసునూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఎల్లవేళలా ముందంజలో ఉంటుందని ఆ శాఖ మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్మకిషోర్, రాంబాబు అన్నారు. సోమవారం మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు, సీనియర్ నేతలు జ్యోతిప్రకాష్, విష్ణువర్ధన్, పుల్లయ్య, నారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. మండల నాయకుడు చాట్ల వీరాస్వామి పార్టీ జెండా ఆవిష్కరించారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కీర్తిరాయుని గూడెం గ్రామ నాయకుడు విజయ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని సిగుడిపాడు గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం మందా కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేశారని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వి.జానేసు, కె. రాజు, మల్లేశు తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ వ్యర్థం.. గ్రామస్తులకు అనర్థం



హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులో నీటితో కలిసి దుర్వాసన వెదజల్లుతున్న కెమికల్ వ్యర్థాలు

జి.కొండూరు: కెమికల్ కంపెనీలు చేసే దారుణాలు హెచ్.ముత్యాలంపాడు గ్రామ ప్రజలకు తలనొప్పిగా మారాయి. రాత్రి సమయాలలో ట్యాంకర్లలో తెచ్చిన కెమికల్ వ్యర్థాలను గ్రామ శివారులో వదిలేస్తున్నారు. దీంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతో పాటు వ్యర్థాలు కలిసిన కాల్వలో నీటిని పశువులు తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. గ్రామాన్ని ఆనుకొని ఈ దారుణానికి పాల్పడడంతో వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు.



హెచ్.ముత్యాలంపాడు గ్రామ శివారులో కెమికల్ వ్యర్థాలు వేసిన ప్రదేశం

వ్యర్థాలను వదిలేది ఎవరు?

సమీపంలోనే కొండపల్లి పారిశ్రామిక వాడ ఉండడంతో అక్కడి కెమికల్ కంపెనీలే ఈ దారుణానికి పాల్పడుతున్నాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సదరు కంపెనీలను ఆరాతీయగా హెచ్.ముత్యాలంపాడు గ్రామం వద్ద కెమికల్ వ్యర్థాలను విడుదల చేసేది ఎవరో మాకు తెలియదని చెబుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా తామెప్పుడూ వ్యవహరించలేదని సదరు కెమికల్ కంపెనీల యాజమానులు వివరణ ఇచ్చారు.

నిఘా తప్పదా

గ్రామస్తులు నిఘా పెట్టి ట్యాంకర్ల నుంచి కెమికల్ వ్యర్థాలను విడుదల చేస్తున్నప్పుడు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటే అసలు నిందితులెవరో తెలుస్తుందని స్థానిక కెమికల్ కంపెనీల యజమానులు సలహా ఇస్తున్నారు. గతంలో విజయవాడరూరల్ మండల పరిధి కొత్తూరు తాడేపల్లి శివార్లలో కూడా ఇటువంటి ఘటనలు వెలుగుచూసినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఫిర్యాదు చేసేందుకు..

దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు హెచ్.ముత్యాలంపాడు గ్రామ ప్రజలు సిద్ధమవుతున్నారు.

రేపటి సమ్మె జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ



నూజివీడులో బైక్ ర్యాలీ

నూజివీడు: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఐఎఫ్‌టీయూ నాయకులు నాగరాజు, ఏఐటీయూసీ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నండూరి హనుమాన్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నూజివీడు: ఈనెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని తుక్కులూరులో కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె డిమాండ్‌లతో కూడిన కరపత్రాన్ని సోమవారం ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు విడుదల చేశారు. నాయకులు బలరామ్, శ్రీనివాసరావు, విజయ్, పుల్లారావు, నరసింహమూర్తి, కే కృష్ణ, అచ్యుత్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

మైలవరం: ఈ నెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెకు సహకరించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ముఠా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు వర్తక, వ్యాపార సంస్థల యజమానులను కోరారు. మైలవరంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చలువాది మధును కలిసి సమ్మె నోటీసును సోమవారం అందజేశారు.

తిరువూరు: సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం తిరువూరులో ప్రదర్శన నిర్వహించారు. సార్వత్రిక సమ్మె ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు పాల్గొన్నారు.



మైలవరంలోని షాపులో సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



తిరువూరులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



తుక్కులూరులో కరపత్రం విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గొయ్యి.. చూసి అడుగెయ్యి



జక్కంపూడి-కె.తాడేపల్లి రోడ్డుపై గొయ్యి

విజయవాడరూరల్: విజయవాడ- విసన్నపేట ఆర్అండ్‌బీ రోడ్డు జక్కంపూడి నుంచి కొత్తూరు తాడేపల్లి వెళ్లే రోడ్డులో పాములు కాల్వ వద్ద పెద్ద గొయ్యి ప్రమాదకరంగా ఉంది. వర్షం వచ్చినప్పుడు ఆ గొయ్యిలో వర్షం నీరు నిలబడి ఉండటంతో అటు వైపువెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ద్విచక్రవాహన దార్లు గొయ్యిలో పడిపోయి గాయాలపాలైన సంఘటనలు అనేకం జరిగాయి. అధికారులు స్పందించిన గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరారు.

10న తల్లిదండ్రుల సమావేశం

ముసునూరు: తల్లిదండ్రులంతా తప్పనిసరిగా హాజరై మెగా పేరెంట్స్‌డేను విజయవంతం చేయాలని ఎంఈఓ- 2 బీవీఎస్ సుబ్బారావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మండలంలోని 66 పాఠశాలల్లో జరుగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేసి, అదే రోజు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు, వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామాల పెద్దలు, పాఠశాలల దాతలు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులకు, తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలను విద్యార్థులే తయారు చేసి అందరినీ స్వాగతిస్తారన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి దాడి చేశారు. పక్కా సమాచారంతో చేసిన దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఆసమయంలో వారి వద్ద లభించిన రూ.11,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకం



పెనుగంచిప్రోలు: మండలంలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల నిర్వాహకులు ఆయా ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలతో పోలీసులు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ భక్తుల రద్దీ ఉండే చోట సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతను పటిష్టపరచుకోవచ్చన్నారు. నేరాల నియంత్రణలోనూ సీసీ కెమెరాలు కీలకంగా మారాయని వివరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్, శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ తదితరులు

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఆందోళన సోమవారం మూడోరోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా ఇంజినీరింగ్ కార్మికులు విధి నిర్వహణలో వినియోగించే పనిముట్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతోపాటు ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, దారెల్లి అశోక్, బ్రహ్మం, వంశీ, దాసు, రవి, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

లైబ్రేరియన్ రామచంద్రుడికి సత్కారం



కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయాధికారిగా పనిచేస్తూ బదిలీపై నందిగామ వెళ్తున్న అల్లూరి రామచంద్రుడును గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కంచికచర్ల గ్రంథాలయ అభివృద్ధికి రామచంద్రుడు చేసిన సేవలను కొనియాడారు. ఆయన బదిలీ కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీడీసీలు లక్ష్మి నరసయ్య, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, శ్రీనివాస రావు, నాగరాణి పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రుడు స్థానంలో నూతన లైబ్రేరియన్‌గా సత్యనారాయణపురం శాఖా గ్రంథాలయం నుంచి బదిలీపై వచ్చిన వి.అమరేశ్వరి బాధ్యతలు చేపట్టారు.ఆమెకు సిబ్బంది, పాఠకులు అభినందనలు తెలియజేశారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

గరికపాడు(జగ్గయ్యపేట):ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆయా పంటలసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ అచ్యుతరాజు సూచించారు. కేవీకేలో సోమవారం ఖరీఫ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ఎంపిక నుంచి పంట దిగుబడి వచ్చే వరకు రైతులు పంటలసాగులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరిలో కలుపు, తదితర విధానాలపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఉద్యాన పంటల్లో ఆ శాఖాధికారుల సలహాల మేరకు సాగు చేపట్టాలని తెలిపారు. అనంతరం పునాది విత్తనాలను రాయితీపై అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మీకళ, ప్రభావతి, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు తంగెళ్లమూడి వీరమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5.30 గంటలకు కాకడ హారతితో గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. అలాగే చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీకల్యాణ సాయిబాబా మందిరంలోనూ గురుపౌర్ణమి నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూధనరావు తెలిపారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని అభిషేకాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

మైలవరంపై వైఎస్సార్ ముద్ర

- మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి
- తారకరామా ఎత్తిపోతల రెండో దశ పనులు పూర్తి
- మైలవరానికి కృష్ణా జలాలు అందించిన ఘనత వైఎస్సార్‌దే
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి



తారకరామా ఎత్తిపోతల పథకం రెండోదశ పంపుహౌస్

జి.కొండూరు: మాటిస్తే మడమ తిప్పని మనిషి అనగానే మనకు గుర్తుకు వచ్చే నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన హయాంలో మైలవరం నియోజకవర్గంపై కూడా చెరగని ముద్ర వేశారు. అన్ని రంగాల్లోనూ నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరిగింది.

తారకరామాతో రైతులకు సాగునీరు

మైలవరం నియోజకవర్గానికి తలమానికమైన తారకరామ ఎత్తిపోతల పథకాన్ని నిష్పక్షపాతంగా రెండవ దశ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరందించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కింది. తారకరామా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి అధికారులు మూడు దశలుగా విభజించారు. మొదటి దశ పనులు అప్పటి మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే, వ్యవసాయ శాఖా మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆధ్వర్యంలో 2004 నాటికి పూర్తయ్యాయి. రెండవ దశలో జి.కొండూరు మండలంలోని 8 గ్రామాలకు చెందిన 4,242 ఎకరాలకు నీరందించడం లక్ష్యంగా ఉంది. దీనికి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో మే 10వ తేదీ, 2006న పనులు ప్రారంభించి 2009 కల్లా పూర్తి చేసి రైతులకు సాగునీరందించారు. మూడో దశ పనులు జి.కొండూరు నుంచి మైలవరం నియోజక వర్గానికి 8,132 ఎకరాలకు నీరందించడం లక్ష్యం. దీనికి శంకుస్థాపన కూడా చేశారు. కానీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించడంతో ప్రాజెక్టు మరుగున పడింది.

కృష్ణా జలాల ఘనత వైఎస్సార్‌దే

మైలవరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కార మార్గాన్ని కూడా వైఎస్ రాజశేఖరరెడ్డే చూపారు. అప్పటికే కృష్ణాజలాలు ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు అందించేందుకు గత ప్రభుత్వం మొదటి దశ పనులను పూర్తి చేసింది. అయితే మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు కూడా తాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.5 కోట్లు కేటాయించి రెండవ దశ పనులను పూర్తి చేశారు. జి.కొండూరు నుంచి చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, గుర్రాజుపాలెం మీదుగా మైలవరం వరకు 12 కి.మీ పైపులైను ఏర్పాటు చేసి అక్కడ ఒక పంపుహౌస్‌ను నిర్మించారు. జి.కొండూరు నుంచి ఆత్కూరు, ముత్యాలంపాడు, కందులపాడు, కొల్లేటిగూడెం, వెలగలేరు వరకు 7కి.మీ పైపులైను ఏర్పాటు చేశారు. చెర్వుమాధవరం నుంచి సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాల మీదుగా దుగ్గిరాలపాడు వరకు 7 కి.మీ పైపులైను ఏర్పాటు చేయడంతో పాటు 3 పంపుహౌస్‌లు నిర్మించి ఆయా గ్రామాలకు తాగునీరందించారు. కందులపాడు నుంచి వెల్లటూరు వరకు 3 కి.మీ పైపులైను ఏర్పాటు చేసి వెల్లటూరు గ్రామానికి కూడా కృష్ణాజలాలను అందించారు. కృష్ణావాటర్ పైపులైను రెండవదశ పనులతో పాటు కుంటముక్కల గ్రామ సమీపంలో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, తారకరామా ఎత్తిపోతల పథకం రెండవదశ పనుల పూర్తి చేసి 2006 మే నెల 10వ తేదీన ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా ప్రాంభించారు.

పోలవరం కాల్వ మళ్లింపు

జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా పోలవరం కుడికాల్వ తవ్వకాలు జరుగుతున్నప్పుడు కాల్వకు చివరి భాగంలో ఉన్న వెలగలేరు గ్రామాన్ని ఆనుకొని తవ్వవలసి ఉంది. అయితే కాల్వను గ్రామానికి ఆనుకొని తవ్వడం వలన గ్రామానికి ఒక వైపు బుడమేరు, మరో వైపు పోలవరం కాల్వ ఉంటే వరదలు వచ్చిన సమయంలో గ్రామం ముంపునకు గురవుతుందని అప్పటి నియోజకవర్గ ఎమ్మెల్యే చనమోలు వెంకట్రావు సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. చనమోలు వెంకట్రావు విజ్ఞప్తి మేరకు కాల్వ రూట్‌మ్యాప్‌ను మార్చి వెలగలేరు గ్రామానికి తూర్పు వైపుగా కాల్వను తవ్వించి బుడమేరులో కలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలపెట్టకూడదనే వైఎస్సార్ నిస్వార్థ వ్యక్తిత్వానికి పోలవరం కుడి కాల్వ మళ్లింపు నిదర్శనంగా నిలుస్తుందని వెలగలేరు గ్రామ ప్రజలు ఇప్పటికీ చెబుతుంటారు.



వైఎస్సార్ ప్రారంభించిన కుంటముక్కల పంపుహౌస్



వెలగలేరు గ్రామానికి తూర్పు వైపుగా మళ్లించిన పోలవరం కుడి కాలువ

నేడు వైఎస్సార్ జయంతి

మైలవరం: మైలవరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎల్‌హెచ్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహిస్తామని పట్టణ పార్టీ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గర్రేపూడి వెంకట్రావు తెలిపారు. అనంతరం స్థానిక మూడు విగ్రహాల సెంటర్‌లో దివంగత మాజీ సీఎం వైఎస్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. రెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు అందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

ఆగిరిపల్లి: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

తిరువూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం తిరువూరులో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో మహనేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సీఐ ఆఫీస్ రోడ్, అష్టలక్ష్మీగుడి సెంటర్, జైబావి సెంటర్, బోయ కాలనీ, పీటీకొత్తూరులలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద జయంతి కార్యక్రమం జరుపుతామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇబ్రహీంపట్నం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు కొండపల్లి మున్సిపాల్టీతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, మండల పార్టీ అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు మంగళవారం సంయుక్తంగా తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్ వేడుకల్లో పాల్గొని ముందుగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద, అనంతరం కొండపల్లి బీకాలనీ, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. పార్టీ వివిధ అనుబంధ విభాగాలకు చెందిన నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు



అమ్మవారికి సారె తెచ్చిన అనిగండ్లపాడు గ్రామ మహిళలు

పెనుగంచిప్రోలు:ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి సోమవారం అమ్మవారి స్వగ్రామం అనిగండ్లపాడు గ్రామం నుంచి మహిళలు సారె సమర్పించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సారె తెచ్చిన మహిళలకు ఆలయం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించారు. . అలాగే వత్సవాయి మండలం పోలంపల్లి నుంచి కూడా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి సారె తెచ్చి బోనాలు సమర్పించారు. సారె తెచ్చిన వారికి ఆలయం వారు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏఈవో జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాలాది వెంకటరమణ, మాజీ ధర్మకర్త కోలా రామారావు, వూట్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొండ ప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కొండ ప్రాంత ప్రజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ కొండ బడి ఎదురు కొండ ప్రాంతంలో వారం రోజులుగా మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటను సమస్యను పరిష్కరించాలని సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. కొండ ప్రాంతంలో మంచినీటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బి.సత్యబాబు, సభ్యులు ఎండీ మస్తాన్, సీఐటీయు నేత ఎస్.ప్రసాద్ మద్దతుగా నిలిచారు. వారు మాట్లాడుతూ కృష్ణానదికి కూతవేటు దూరంలో ఉన్నా ఈ ప్రాంత ప్రజలకు మంచినీరు కొరత ఏర్పడటం బాధాకరమన్నారు. సమస్యపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వందల మెట్లు దిగి మంచినీళ్లు తెచ్చుకుని మళ్లీ అన్ని మెట్లు ఎక్కాల్సి రావడం ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండ ప్రాంత మహిళల ఇబ్బందులను గమనించి ప్రత్యేక పంపింగ్ బూస్టర్‌ను ఏర్పాటు చేసి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం వద్దకు వచ్చిన వాటర్ సప్లై ఏఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ధ్యానచంద్రకు వినతి పత్రం అందజేశారు. దుర్గాకుమారి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలిశెట్టి నాగేశ్వరరావుకు డాక్టరేట్



కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న మలిశెట్టి నాగేశ్వరావుకు డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ సోమవారం తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి సంబంధించి 'ఎనర్జీ అవేర్ రౌంటింగ్ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్ త్రూ మెటా హెరిస్టిక్ ఆప్టిమైజేషన్ అల్గోరిథమ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు జేఎన్‌టీయూ (కాకినాడ) యూనివర్సిటీ అధికారులు, మలిశెట్టి నాగేశ్వరరావుకు డాక్టరేట్ అందించినట్లు వివరించారు. డాక్టరేట్ పొందిన నాగేశ్వరరావుకు కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

దాతల సాయంతో లక్ష్యాన్ని చేరుకోవాలి



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో దాత సురేష్ బాబు, కార్పొరేటర్ రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దాతల సాయంతో విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఆకాంక్షించారు. 'పది' పరీక్షల్లో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పీఈటీగా పని చేసి రిటైరైన గద్దె సురేష్‌బాబు, ఆయన పెద్ద కుమారుడు రవితేజ, కోడలు ప్రణవి (ఎన్‌ఆర్‌ఐ) సౌజన్యంతో రూ.1,01000నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 16 మందికి రూ.10, 8, 7, 6, 5 వేలు చొప్పున అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు నగదు పురస్కారాలను అందుకున్న పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని అంతకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గద్దె సురేష్ బాబు మాట్లాడుతూ పాఠశాలలో ఇంత మంచి ఫలితాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. అందుకే తమ కుటుంబసభ్యులందరం కలిసి నగదు పారితోషకం అందించామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్ వెంకట్రావు, పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కె.రంగారావు, జమీల భాను, లక్ష్మీ నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహామేళాకు తరలిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు



నందిగామ రూరల్: ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటం ఎనలేనిదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కనకపూడి వెంకట రత్నం మాదిగ పేర్కొన్నారు. ఒంగోలులో సోమవారం తలపెట్టిన మాదిగ మహామేళాకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటాల నుంచి పుట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నంద్రు మరియదాసు మాదిగ, గద్దల కొండ మాదిగ, కోండ్రు రాజారావు మాదిగ, కంభంపాటి సూరి మాదిగ, మాదుగుల నాగమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం నిలిపివేతపై భక్తుల మండిపాటు

పెనుగంచిప్రోలు: ఏటా ఆషాడమాసం శ్రీతిరుపతమ్మవారితోపాటు ఆలయంలోని సహదేవతలను శాకాంబరీ అలంకరణ అనంతరం అదేరోజు సాయంత్రం గ్రామంలో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అయితే ఈఏడాది వర్షం కురుస్తుందేమోనన్న సందేహంతో అధికారులు ఆదివారం రాత్రి జరగాల్సిన గ్రామోత్సవాన్ని నిలిపివేశారు. మధ్యాహ్నం మబ్బు పట్టడంతో వాతావరణం అనుకూలించదని భావించిన అధికారులు గ్రామోత్సవం నిలిపివేయడమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారి ఊరేగింపుగా తమ ఇంటి ముందుకు అమ్మవారు వస్తుందని గ్రామస్తులు భావించగా, వాతావరణం అనుకూలించదనే ఉద్దేశ్యంతో గ్రామోత్సవం ఎలా నిలిపివేస్తారని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షం పడుతుందనుకుంటే వాతావరణశాఖ అధికారుల నుంచి వాతావరణ సమాచారం తీసుకోవాలని, అలా చేయకుండా ఆలయ అధికారులు ఇష్టారాజ్యంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని గ్రామమహిళలు మండిపడుతున్నారు. గతంలోనూ ఆలయ అధికారులు ఇలానే చేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని గుర్తుచేసుకుంటున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు భక్తుల మనోభావాలను గుర్తించడంతోపాటు ఆలయ ఆచార, సంప్రదాయాలను గౌరవించాలని భక్తులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



కలరా హాస్పటల్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ పరిధిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. యూనియన్ ఆధ్వర్యాన సోమవారం చిట్టినగర్ ప్రాంతంలోని సర్కిల్-1 కార్యాలయం (కలరా హాస్పటల్) వద్ద యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా నాయకత్వంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నా పార్కుల కార్మికులకు ఒక జీతం, ఇంజినీరింగ్ కార్మికులకు ఒక రకం జీతం, పారిశుద్ధ్య కార్మికులకు మరొక రకమైన జీతం చెల్లించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఒక్కొక్కరికి ఒక రకమైన జీతం ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనన్నారు. వారి ఉత్తర్వుల ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందకపోవడం దారుణమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దును వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ హెలెన్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గాసి రమణమ్మ, యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కి జేమ్స్, సహాయ కార్యదర్శి తుపాకులు ప్రతాప్, కోశాధికారి తుపాకులు నాగేశ్వరరావు, నాయకులు బి దుర్గాప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ చేస్తే వాహనాలు సీజ్



రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలను టోయింగ్ వెహికల్ ద్వారా తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖరబాబు, ట్రాఫిక్ డీసీపీ ఎ.వి.ఎల్ ప్రసన్న ఆదేశాల మేరకు మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు సత్యనారాయణపురం పరిధిలో రాంగ్ పార్కింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ ప్రాంతంలో ఇతర వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రల వాహనాలను టోయింగ్ వెహికల్ ద్వారా తొలగించి వాటి యజమానులకు జరిమనాలు విధించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ రాంగ్ పార్కింగ్ చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత సేవా సంస్థ చైర్మన్ పెనుమత్స అప్పలరాజు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని అన్నారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ఎల్లప్పుడు ముందుండాలని పిలుపునిచ్చారు. భోజనం ప్లేట్లు, ఇతర పరికరాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వత్సవాయి కృష్ణంరాజు, ట్రెజరర్ ఏహెచ్‌వీ సురేష్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలి

చాట్రాయి: సాగులో పోషక పదార్థాల యాజమాన్యంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని చాట్రాయి గ్రామంలో వరి నాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటించకపోతే చీడపీడల ఉధృతి ఎక్కువై పంటల ఎదుగుదల తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. యూరియా పంట రకం కాలం, నేల స్వభావం బట్టి ఖరీఫ్ వరిలో ఒక హెక్టార్‌కు 60 నుంచి 100 కేజీలు వాడాలని, మూడు దఫాలుగా (నాటు వేసేటపుడు. పిలకలు బాగా ఎదిగినపుడు, పూత దశలో) వేయాలని ఆయన చెప్పారు. భాస్వరం హెక్టార్‌కు 50 నుంచి 60 కిలోలు, అదే ఆమ్ల భూములు అయితే 100 కేజీలు వాడాలని తెలిపారు. పోటాషియం హెక్టార్‌కు 50 నుంచి 80 కిలోలు వాడాలని ఆయన సూచించారు.

ఎంఈవో-1గా రామ్మూర్తి



ముసునూరు: ఎట్టకేలకు ముసునూరు మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి-1 గా టి.రామ్మూర్తి నియమితులైనట్లు విద్యా శాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ఆయన ఎంఈఓ-1గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను మంగళవారం చేపట్టనున్నారు. ఏలూరు జిల్లాలోని టి.నర్సాపురం మండలంలో పనిచేస్తున్న ఆయన ముసునూరు మండల ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి 25 అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపారు. డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఇన్‌చార్జి ఏడీఏ అలూరి చాముండేశ్వరి, హెచ్‌ఓ ఆర్ హేమ, సీడీపీఓ పిల్లి విజయకుమారి, ట్రిపుల్ ఐటీ ఎస్సై జీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని ఇలా..

- చాట్రాయి మండలం చనుబండలో సర్వేనంబరు 123లో 1.81 ఎకరాల తన భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని చెరుకు హిరీస్ ముఖర్జీ అర్జీ అందజేశారు.
- నూజివీడులోని అజరయ్యపేటలో సర్వేనంబరు 725/4 దాఖలా 216 చదరపు గజాల తన ఇంటి స్థలాన్ని తన సోదరులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, న్యాయం చేయాలని కలపాల చిన వెంకటేశ్వరరావు అర్జీని అందజేశారు.
- వితంతు పింఛన్ కోసం ఏడాదిన్నరగా దరఖాస్తు చేస్తున్నా.. మంజూరు చేయాలని పోలసానపల్లికి చెందిన కటికల సుశీల అర్జీని అందజేసింది.
- మస్కట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన దగ్గర రూ.99,500 తీసుకుని పురమా శ్రీనివాసరావు మోసం చేశాడని, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, డబ్బులు ఇప్పించాలని గాంధీనగర్‌కు చెందిన తొండుల రాము అర్జీ అందజేశారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీల ఆందోళన



నూజివీడులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కూలీలు

నూజివీడు: మండలంలో ఉపాధి హామీ పథకం అక్రమాలకు నిలయంగా మారిందని కూలీలు ఆరోపిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు రోజురోజుకు ఉధృతమవుతన్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. తాము పనిచేసిన అన్ని రోజులకు మస్తర్లు వేయకుండా, చేసిన పనికి సంబంధించి కొలతలు సరిగా నమోదు చేయకుండా ఉపాధహామీ పథకం సిబ్బంది తమకు అన్యాయం చేస్తున్నారని మండలంలోని సుంకొల్లుకు చెందిన ఉపాధి కూలీలు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకం పనులకు 10 వారాలు వెళ్తే ఒక్క రూపాయి కూడా కూలి డబ్బులు రాలేదు. అడిగితే వారం రోజులు టైం ఇవ్వండంటూ జాప్యం చేస్తున్నారని పోలగాని రంగమ్మ వాపోయింది. తాను ఆరు వారాలు పనికి వెళ్తే 4 వారాలు వచ్చినట్టు రాశారని, మూడు వారాలకు రూ.2200 మాత్రమే వచ్చాయని సిరిగిబత్తుల లక్ష్మీ కుమారి వాపోయింది. తాను 24 రోజులపాటు పనికి వెళ్తే మూడు రోజులు మాత్రమే పనిచేసినట్టుగా రూ.1000 మాత్రమే కూలి డబ్బులు ఇచ్చారని కొనకాల వెంకట నరసమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

పీర్ల ఊరేగింపు



విస్సన్నపేట: హుస్సేన్ సోదరులు చేసిన త్యాగానికి గుర్తుగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం పండుగ జరుపుకున్నారు. సోమవారం గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం రాత్రి నిప్పులగుండంలో ముస్లింలు, భక్తులు నడిచారు.

ఘనంగా మాజీ మంత్రి చనుమోలు వర్ధంతి



జి.కొండూరులో పండ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు

జి.కొండూరు: దివంగత మాజీ మంత్రి చనుమోలు వెంకట్రావు వర్ధంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు ఆధ్వర్యంలో జి.కొండూరులోని వెంకట్రావు విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చనుమోలు వెంకట్రావు సేవలను కొనియాడారు. పేదలకు పండ్లను పంపిణీ చేశారు. కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సర్పంచ్ మండల అరుణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, ఇతర నాయకులు పాల్గొన్నారు. వెలగలేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యర్రగుంట సుకుంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కందులపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న చనుమోలు వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసిన ఆయన అభిమానులు, వెంకట్రావు సేవలను కొనియాడారు.

ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి చనుమోలు వెంకటరావు వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఆయన విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మరో కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్‌లు నివాళ్లర్పించారు.

మైలవరం: మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని మూడు విగ్రహాల సెంటర్‌లోని దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, దివంగత మాజీ ఎమ్మెల్యే చనుమోలు వెంకట్రావు విగ్రహాలకు పూల మాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బ్లాక్-1 అధ్యక్షుడు దోనపాటి గిరిదర్ కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షులు శీలం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అన్నవరపు దుర్గారావు, కొత్తగుండ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మేలైన పశుగ్రాసం విత్తనాలు



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పాడిరైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన సదస్సు గుంటుపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. విజయవాడ పశుసంవర్థఖ శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ రాయితీపై అందిస్తున్న మేలైన పశుగ్రాస విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుగ్రాసం సాగుతో వచ్చే గడ్డితో రెండు పశువులను మేపుకుని పాల ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. మేలైన పశుగ్రాసం తినడం వలన పశువులు ఆరోగ్యంగా పెరుగుతాయని తెలిపారు. మినరల్ మిక్చర్, పురుగుల మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ మోజెస్ వెస్లీ, అసిస్టెంట్ డైరెక్టర్‌లు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, ఎల్ఎస్‌ఏ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కొండపల్లి హెచ్‌పీసీఎల్ కంపెనీ వద్ద కార్మికులతో కలసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయిల్ కంపెనీలతో పాటు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారిన లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరారు. హెచ్‌పీసీఎల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, రాజశేఖర్‌బాబు, సుందరరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జ్ ఈవో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఈనెల 10న ఆషాడ మాసపౌర్ణమి సందర్భంగా సత్యమ్మ అమ్మవారిని పలురకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి శాకంబరీ అలంకారానికి కూరగాయలు, తదితరాలను అందించదలచిన భక్తులు ఈనెల తొమ్మిదోతేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా అందించాలని ఆయన కోరారు.